పాపం.. పారిశుధ్య కార్మికులు

- ఐదారడుగుల లోతులో భూగర్భ డ్రైనేజీ పనులు
- అనారోగ్యంతో అవస్థలు
- భద్రతా చర్యలు చేపట్టడంలో జీవీఎంసీ విఫలం


ఇలా అయితే రోగాలు రావా?


ఎటువంటి భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు


అనారోగ్య సమస్యలతో మంచాన పడిన కార్మికురాలిని పరామర్శిస్తున్న సిటు నాయకులు

డాబాగార్డెన్స్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మంచాన పడుతున్నారు. వారు చేస్తున్న పనుల్లో భద్రతా ప్రమాణాలు కల్పించడంలో జీవీఎంసీ పూర్తిగా విఫలమవుతోంది. ఫలితంగా మురుగు కూపాలు.. భూగర్భ డ్రైనేజీ పనులు వారికి శాపంగా మారాయి. చివరకు అనారోగ్యంతో మృత్యువాత పడుతున్న వారు కొందరైతే.. ఆస్పత్రి పాలవుతున్న వారు మరి కొందరు.

జీవీఎంసీ 98 వార్డుల్లో వేలాది మంది పారిశుధ్య కార్మికులు పనులు నిర్వహిస్తున్నారు. వీరిలో భూగర్భ డ్రైనేజీ పనులు చేసే వారు కొందరైతే.. అత్యంత ప్రమాదకరమైన రీతిలో పనులు చేపట్టే వారు మరి కొందరు. చెత్త తరలించేవారు.. కుక్కలు పట్టేవారు.. జోనల్ కార్యాలయాల్లో పని చేసే వారు.. క్లాప్ వాహనాల్లో పని చేసే వారు.. ఇలా వేకువజాము నుంచి రాత్రి పొద్దుపోయే వరకు 24 గంటలు పని చేస్తూ.. నగర ప్రజల ప్రాణాలకు తమ ప్రాణాలు అడ్డు పెడుతున్నారు. ఇటీవల చాలా మంది అనారోగ్య సమస్యలతో మంచాన పడ్డారు.. పడుతున్నారు కూడా.

సమస్యలపై కమిషనర్‌కు మొర..

జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు గత 6 నెలలుగా పనిముట్లు సరఫరా చేయలేదు. ఫలితంగా వారు పని చేయడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గత నెల 28న జీవీఎంసీ కమిషనర్‌కు కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వినతి పత్రం అందజేసింది. కార్మికులకు పనిముట్లు సరఫరా చేయాలని, ఏడాది కాలంలో చనిపోయిన, రిటైర్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మికుల సంఖ్య తగ్గి పారిశుధ్య పనికి ఇబ్బంది కలుగుతుందని, ఉన్న కార్మికులపై పని భారం పెరుగుతుందని, వెంటనే ఆ ఉద్యోగాలు కార్మికుల కుటుంబ సభ్యులచే భర్తీ చేయాలని, చాలా మంది పారిశుధ్య కార్మికులు అనారోగ్యంతో పని చేస్తున్నారని, వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులకు రక్షణ సామగ్రి, సబ్బులు, నూనెలు ఇవ్వాలని, రెయిన్‌కోట్లు అందజేయాలని, కార్మికులకు 2 జతల బట్టలు, కుట్టు కూలి ఇవ్వాలని, విలీన పంచాయతీ కార్మికులకు 13 నెలల ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు చెల్లించాలనే డిమాండ్లతో కూడిన వినతి పత్రం కమిషనర్‌కు అందజేసింది. అయితే ఫలితం మాత్రం శూన్యం అని కార్మికులు వాపోతున్నారు.

కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు..

కార్మికుల సమస్యలపై కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పనిముట్లు లేవు.. వీల్ బార్స్ లేవు.. బేసిన్స్ లేక గోనె సంచిలో చెత్త ఎత్తుతున్నారు. కార్మికుల్లో ఎవరికైనా ప్రమాదం జరిగితే పట్టించుకునే నాథుడే లేడు. ఈఎస్ఐ ఉంది కదా.. అన్న ధీమాతో కార్మికులను గాలికొదిలేస్తున్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల విషయమై గత నెలలో కమిషనర్‌కు మొర పెట్టుకున్నాం. ఇప్పటి వరకు స్పందించిన నాథుడే కరవయ్యాడు. కార్మికుల శ్రేయస్సు.. సంక్షేమం ఎవరికీ పట్టడం లేదు.

– టి. నూకరాజు, అధ్యక్షుడు, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

జ్యోతిర్లింగాలను దర్శించుకున్న ఆశ్రమ వాసులు


యోగి ప్రభాకర్ వర్ధన్ ఆశీస్సులు పొందుతున్న వివేకానంద ఆశ్రమ వాసులు

డాబాగార్డెన్స్: నగరంలోని కైలాసగిరి, విశాలాక్షినగర్ బీచ్ రోడ్డులో గల యోగి నాగేంద్రస్వామి ఆలయంలో ద్వాదశి సందర్భంగా అక్కడ ఉన్న జ్యోతిర్లింగాలను స్వామి వివేకానంద ఆశ్రమ వాసులు బుధవారం దర్శించుకుని యోగి ప్రభాకర వర్ధన్ స్వామి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ హిమాలయాల్లో తపస్సు చేసుకుని వచ్చిన యోగి ప్రభాకర వర్ధన్ స్వామి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అక్కడ ఉన్న బీచ్‌లో ఆశ్రమ వాసులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, ఆశ్రమ వాసులు పాల్గొన్నారు.

అయిన వారి చెంతకు అభాగ్యుడు


రజత్ రాజారాంను సోదరునికి అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: మహారాష్ట్రలోని పూణే నుంచి విశాఖ వచ్చేసిన ఒక వ్యక్తిని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూణేలోని సతార్‌నగర్‌కి చెందిన రజత్ రాజారాం (35) పక్షవాతం వలన చిన్నప్పటి నుంచి బాధపడుతున్నాడు. ఏడేళ్ల పాటు సెక్యూరిటీగార్డుగా పని చేశాడు. భార్యతో గొడవల కారణంగా మానసిక ఆరోగ్యం కూడా బాగా దెబ్బతింది. రెండు నెలల క్రితం ఇల్లు వదిలి విశాఖ వచ్చేశాడు. ఏయూటీడీ సంస్థ రెస్క్యూ ద్వారా ఇతన్ని ద్వారకానగర్‌లో గల జీవీఎంసీ–ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. ఇతని తల్లి పోలీస్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఏయూటీడీ ద్వారా సమాచారం తెలుసుకున్న రాజారాం అన్నయ్య ప్రజ్యోత్ రాజారాం వసతి గృహానికి బుధవారం చేరుకున్నారు. మందులు వాడకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగి విశాఖ వచ్చేశాడని సోదరుడు తెలిపారు. రజత్‌ని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో అతని సోదరుడికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధా సంస్థ వలంటీర్లు హరీషా, గౌతం పాల్గొన్నారు.

వేడుకగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి


ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: పాతనగరం చెంగల్రావుపేట అగ్రహారం వీధిలో వేంచేసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి 416వ జయంతి బుధవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపారు. ఉదయం 10.30 గంటలకు చిలుక ద్వాదశిని పురస్కరించుకుని స్వామి వ్రతం నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా పూజా మందిరం ప్రతినిధి మాట్లాడుతూ 400 ఏళ్ల కిందటే భవిష్యత్తును కాలజ్ఞానంగా సామన్యులకు అర్థమయ్యేలా బోధించారన్నారు. ఆ రోజుల్లోనే కులం, మతం మానవత్వానికి అడ్డంకి కాదని తెలిపారన్నారు. ప్రతి ఏటా ఆలయ కమిటీ, సంఘీయుల సహకారంతో వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు.

క్లుప్తంగా

అట్రాసిటీ కేసుల పరిష్కారంలో చొరవ చూపాలి


మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీలేఖ

మహారాణిపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని విశాఖపట్నం ఆర్డీవో పి.శ్రీలేఖ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సబ్ డివిజనల్ విజిలెన్స్–మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు, ఇతర విభాగాల అధికారులు భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇప్పటి వరకు నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, బాధితులకు నిర్ణీత కాలంలో నష్టపరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు చేరువ చేయాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ, దర్యాప్తులో జాగ్రత్త వహించాలన్నారు. నగర పరిధిలోని ఏసీపీలు, తహసీల్దార్లు, జీవీఎంసీ అధికారులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో జి.వి. రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వయంగా అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకుడు పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

న్యూమోనియా లక్షణాలుంటే నిర్లక్ష్యం తగదు


పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: పిల్లల్లో న్యూమోనియా లక్షణాలు ఉంటే దగ్గరలో ఉన్న యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు తీసుకు రావాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో న్యూమోనియా పై అవగాహన కల్పిస్తూ రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగ్గు, జలుబు ఎక్కువ రావటం, అధిక జ్వరం, శ్వాస తీసుకునే సమయంలో డొక్కలు ఎగురవేయటం తదితర లక్షణాలు ఉంటే దగ్గరలో గల ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని అన్నారు. నేటి నుంచి ఫిబ్రవరి 28 వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో న్యూమోనియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి మాట్లాడుతూ న్యూమోనియా నుంచి రక్షించుకోవడం కోసం ముఖ్యంగా చంటి పిల్లలకు పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలన్నారు. తాగునీటి పాత్రలపై మూతలు పెట్టుకోవాలని, మల మూత్రాల తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఎస్.వి.సమత, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి తులసి, వివిధ విభాగాల వైద్యులు డాక్టర్ జగదీష్ ప్రసాద్, డాక్టర్ నళిని, మనోరమ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తదితరులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి టి. పోలితల్లి తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఏవీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, ఏవీఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలితో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు కరపత్రాలు అందజేశారు. గురువారం ఉదయం 10 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలు ప్రారంభించనున్నట్టు చెప్పారు. ముందుగా మ్యూజికల్ చైర్ పోటీలు, కథలు, తెలుగు పద్యాల పోటీలు (3,4,5 తరగతులకు) ఉంటాయన్నారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథపాలకుల సదస్సు, 17న చిత్రలేఖనం, చదరంగం పోటీలు, 18న క్విజ్, దేశభక్తి గేయాల పోటీలు, 19న ముగ్గుల పోటీలు, పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 20న వారోత్సవాల ముగింపు, విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.

నెహ్రూబజార్ ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో..

సీతమ్మధార: ద్వారకానగర్ దరి నెహ్రూబజార్‌లో గల ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గెజిటెడ్ లైబ్రేరియన్ బీపీ పద్మావతీదేవి బుధవారం సాక్షికి తెలిపారు. 14న వారోత్సవాల ప్రారంభం, 15న పుస్తక ప్రదర్శన, మాదకద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యతపై చర్చ, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి అవలోకనం, 17న కవి సమ్మేళనం, రచయితల సందేశాలు, 18న చిత్రలేఖనం పోటీలు, 'విద్యార్థి దశలో నైతిక విలువల ఆవశ్యకత' అనే అంశంపై వ్యాస రచన పోటీలు, 19న ఇందిరాగాంధీ జయంతి వేడుకలు, బాలికలకు మ్యూజికల్ చైర్ పోటీలు, 20న వారోత్సవాల ముగింపు వేడుకలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా అక్షరాస్యత దినోత్సవం, విజేతలకు బహుమతి ప్రదానం జరుగుతాయన్నారు.

శాఖాగ్రంథాలయంలో పలు పోటీలు..

అల్లిపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు అల్లిపురం శాఖా గ్రంథాలయ అధికారి పీవీ నూకరాజు తెలిపారు. దీంట్లో భాగంగా గురువారం జీవీఎంసీ ఏఎంవోహెచ్ కృష్ణంరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నామన్నారు. 15న గ్రంథాలయాలు–ఉపయోగాలు వ్యాసరచన పోటీ, 16న విజన్–2040–స్వర్ణాంధ్రప్రదేశ్ అనే అంశంపై వక్తృత్వ పోటీలు, 17న విజ్ఞానం పెంపొందించడంలో గ్రంథాలయాల పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు, 18న దేశ భక్తి గేయాలు, 19న మహిళలు రక్షణకు చట్టాలపై మహిళా దినోత్సవం సందర్భంగా వ్యాస రచన పోటీలు, 20న ముగింపు ఉత్సవాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాలకు విద్యార్థులను పంపి ప్రోత్సహించాలని పలు పాఠశాలలకు ఆహ్వానం పలికారు.

నేటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ సర్వే

మహారాణిపేట: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా నేషనల్ కమ్యూనికేబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ–3) కార్యక్రమానికి గురువారం నుంచి శ్రీకారం చుడుతున్నారు. ఈ కార్యక్రమం అమలు కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమగ్ర ప్రణాళిక రూపొందించింది. గురువారం నుంచి తొమ్మిది నెలల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 54 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పట్టణ ప్రాంతాల్లో అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల పరిధుల్లో ఏఎన్ఎంలు, నర్సింగ్ విద్యార్థినులు ఈ సర్వే కార్యక్రమం చేపడుతున్నారు. ఈ మేరకు ఏఎన్ఎంలు, నర్సింగ్ విద్యార్థినుల చేత సర్వే చేస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. 18 సంవత్సరాలు దాటిన అందరికీ ఎన్‌సీడీ పరీక్షలు నిర్వహిస్తారు. 30 సంవత్సరాలు దాటిన పురుషులు, స్త్రీలకు నోటి క్యాన్సర్ పరీక్షలు చేస్తారు. 30 సంవత్సరాలు దాటిన స్త్రీలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేస్తారు. ప్రతి ఒక్కరు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం వల్ల క్యాన్సర్ మహమ్మారిని ముందుగా గుర్తించి ఆరోగ్యం కాపాడుకోవడానికి వీలుంటుందని డీఎంహెచ్‌వో తెలిపారు. సమావేశంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఎస్.వి.సమత, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి తులసి, వివిధ విభాగాల వైద్యులు డాక్టర్ జగదీష్ ప్రసాద్, డాక్టర్ నళిని, మనోరమ తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గ ఆదర్శమూర్తి రమణారావు

డాబాగార్డెన్స్: పీర్లెస్‌లో ఉద్యోగం చేసుకుంటూ కార్మిక వర్గానికే నాయకత్వం వహించిన ఆదర్శ మూర్తి ఏపీ రమణారావు అని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ కొనియాడారు. రమణారావు 4వ వర్ధంతి బుధవారం సిటు కార్యాలయంలో జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి. గంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా రమణారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ రమణారావు జాతీయ కార్యదర్శిగా బాధ్యత చేపట్టారన్నారు. విశాఖలో మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వార్వాని స్థాపించి అపార్టుమెంట్ సంఘాలను ఐక్య పరచడంలో కీలక పాత్ర పోషించారన్నారు. అలాగే సాహితీవేత్త కాకపోయినా సాహితీ వేత్తలను ఒకే వేదికపైకి తెచ్చారన్నారు. ఆయన ఆశయాల కోసం పోరాటం చేయడమే సరైన నివాళి అని పేర్కొన్నారు. సీపీఎం నగర కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, జిల్లా నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి. జగన్, బి. పద్మ, బొట్టా ఈశ్వరమ్మ, వి. కృష్ణారావు, ఎం. రాంబాబు, సత్యవతి, వెంకట్రావు, నాయుడు, సుబ్బారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి

అల్లిపురం: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఈస్ట్ ట్రాఫిక్ సర్కిల్–1 ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను అన్నారు. రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రియాంక విద్యోదయ హైస్కూల్ విద్యార్థులకు ఆయన బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రహదారిపై ప్రయాణించే సమయంలో నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ఎటువంటి సమస్య వచ్చినా తక్షణమే పోలీసులకు తెలియపరచాలన్నారు. డయల్ 100కు సమాచారం అందజేయాలన్నారు. టూటౌన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యంగా అమ్మాయిలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపించినా, అల్లరి పెట్టినా తప్పకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భగీరథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోన్-4 ఆదాయం రూ. 16 లక్షలు


జెడ్సీకి చెక్కు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కార్యాలయానికి బుధవారం రూ. 16 లక్షలు ఆదాయం వచ్చింది. జోన్ పరిధిలోని 12 వార్డుల్లో ఇళ్ల స్థలాలు, అపార్టుమెంట్లు, దుకాణ సముదాయలకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది కొలతలు వేస్తున్నారు. అలాగే వార్డులో గతంలో చెల్లించాల్సిన పన్ను బకాయిలు కూడా వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే బుధవారం ఒక్కరోజూ రూ. 16 లక్షల ఆదాయం వచ్చింది. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు చెక్కును జెడ్సీ మల్లయ్యనాయుడుకి అందించారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ వసూళ్లు మరింత వేతగవంతం చేయాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, ట్యాక్స్ కలెక్టర్లు, సెక్రటరీలు సమన్వయం చేసుకుని లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పన్ను చెల్లింపుల్లో చెక్కులు తీసుకోకుండా డీడీలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్వోలు అప్పలరాజు, రత్నాలరాజు, ఆర్ఐలు సీతారాం, ఉదయ్‌భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిదారుల దుకాణాలకు నోటీసులు..

జీవీఎంసీ జోన్ –4 పరిధిలో బకాయిలు చెల్లించని భవనాలు, దుకాణాలకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది నోటీలు అంటిస్తున్నారు. ఈమేరకు జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు ముందుగా నోటీసులు జారీ చేసి తర్వాత దుకాణాలు సీజ్ చేస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అప్పటికీ చెల్లించని వారి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు. బుధవారం జోన్ పరిధిలో టీఎస్ఆర్ షాపింగ్ మాల్ దుకాణ సముదాయలో 17వ నంబర్ దుకాణానికి రెవెన్యూ అధికారులు దగ్గరుండి నోటీసులు అంటించారు.

నేడు మిజోరం గవర్నర్ రాక

మహారాణిపే: మిజోరం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు గురువారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి గురువారం ఉదయం 10.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి దసపల్లా హిల్స్‌లోని తన ఇంటికి వెళతారు. ఈ నెల 15, 16వ తేదీల్లో గవర్నర్ డ్యూటీ డిశ్చార్జ్‌లో ఉంటారు. 17న మధ్యాహ్నం 2.55 గంటలకు ఇంటి నుంచి విశాఖ విమానాశ్రయానికి బయలుదేరుతారు. 3.05 గంటలకు విమానంలో కోల్‌కతా వెళ్తారు.


టౌన్‌హాల్, ఏపీహెచ్ఆర్డీ ఇనిస్టిట్యూట్ పరిశీలన


టౌన్‌హాల్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, అధికారులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–4 పరిధిలో నిర్వహిస్తున్న ఏపీహెచ్ఆర్డీ ఇనిస్టిట్యూట్, టౌన్‌హాల్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇనిస్టిట్యూట్ హెరిటేజ్ భవనాన్ని, దాని నిర్వహణ గురించి తెలుసుకున్నారు. భవనం పై భాగాన వర్షానికి నీరు నిల్వ ఉండి, భవనం సీలింగ్‌లో నీరు లీక్ అవుతున్న ప్రాంతాలను గమనించి, దాని నిర్వహణ బాధ్యత ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ నిర్వహించాలని ఏపీహెచ్ఆర్డీఏ ఉప కార్య నిర్వాహక ఇంజినీర్‌ను ఆదేశించారు. అనంతరం టౌన్‌హాల్‌ను కమిషనర్ పరిశీలించారు. సామాజిక సేవకులు సోహన్ హట్టంగడి టౌన్‌హాల్‌ను 1904లో నిర్మించారని, ప్రస్తుతం ఇది వైజాగ్ పటం క్లబ్‌గా నిర్వహించబడుతుందని, ఇక్కడి మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. టౌన్‌హాల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు వినియోగించేలా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక ఇంజినీరు పీవీవీ సత్యనారాయణరాజును ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు పి. శివప్రసాదరాజు, పర్యవేక్షక ఇంజినీరు పీవీ సత్యనారాయణరాజు, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఏపీహెచ్ఆర్డీఏ ఉప కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్ ప్రసాద్, ఏఎంవోహెచ్ డాక్టర్ కృష్ణంరాజు, ఏసీపీ ఝాన్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే ఉద్యమం ఉధృతం

సీఐటీయూ నేతల హెచ్చరిక


జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

సీతమ్మధార: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు నాలుగు నెలల బకాయి జీతాలు చెల్లించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కులో బుధవారం జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదేళ్లుగా శానిటేషన్ వర్కర్లు పనిచేస్తున్నారని, వీరికి కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వేతనాలు చెల్లించడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటీయూ) పిలుపుమేరకు జీవీఎంసీ పార్కు వద్ద ధర్నా నిర్వహిరచినట్లు తెలిపారు. కార్మికులకు నాలుగు నెలల బకాయి జీతాలు చెల్లించాలని, ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక శానిటేషన్ వర్కర్‌ని నియమించాలని, కనీస వేతనం 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ గౌరవాధ్యక్షురాలు జి.మంగశ్రీ, అధ్యక్షురాలు బంగారమ్మ, సీఐటీయూ నాయకురాలు పి.మణి, ఐటీయూ నాయకులు వసంత, లక్ష్మి, వై.లక్ష్మి, కె.లక్ష్మి, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.39.28 లక్షలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో సెప్టెంబర్ 11 నుంచి ఈ నెల 11 వరకు హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం రూ.39,28,888, 52 గ్రాముల 100 మిల్లీ గ్రాముల బంగారం, కిలో 123 గ్రాముల 100 మిల్లీ గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో కె.శోభారాణి తెలిపారు. యూఎస్ఏకి చెందిన 60 డాలర్లు, 12 సింగపూర్ డాలర్లు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన 5 దిర్హామ్‌లు, సౌదీ అరేబియాకి చెందిన 10 రియాల్స్, ఖతర్ సెంట్రల్ బ్యాంక్‌కి చెందిన 1 రియాల్ వచ్చినట్లు వివరించారు. దేవదాయ శాఖ తనిఖీదార్ ఎం.శ్రీధర్, ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఎస్.వరప్రసాద్, వన్‌టౌన్ కానిస్టేబుల్ జి.రామకృష్ణారెడ్డి, గోపాలపట్నం శ్రీహరి సేవ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.